


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**తక్షపురం** అట్టుడిగినట్టు వుడికిపోతోంది. అర్ధరాత్రి వెయ్యి సర్పాలు ఒకేసారి బుసకొట్టినంత శబ్దం. గాఢనిద్రలో వున్న వాళ్ళని సైతం లేపిన మహా శబ్దం. గ్రామస్తులు అమాయకులు. భయపడటం తప్ప వివరాలు తెలుసుకుని ప్రతి చర్య గురించి ఆలోచించేంత నాగరికులు కారు. అందరిలోనూ ఒకే భయం... 'ఆ మహా సర్పం శిలారూపం విడిచి ఊరి మీదకి వచ్చిందా' అని. ఆలాగే జరిగితే అది అందర్నీ కొండ చిలువలా పొట్టన పెట్టుకుంటుందని భయం. తలుపులు బిగించివున్నా కూడా జనాలు దుప్పట్లు కప్పేసుకున్నారు.

"ఏం చెయ్యడం?" ఓ మహిళ ఒణుకుతూ భర్తని అడిగింది.

"నోరు మూసుకుని వుండడమే. మనం మేలుకుని వున్నామని దానికి తెలిస్తే అది ముందర మింగేది మననే" గుసగుసగా అన్నాడు భర్త.

"ఇదిగో నిన్నే.." భయంగా అన్నాడు త్రివిక్రమశాస్త్రి భార్యని లేపుతూ.

"లేచేవున్నా.." మూలిగినట్టు అందావిడ.

"పాము ఊరిమీద పడుతుందంటావా?" భయంతో అన్నాడు శాస్త్రిగారు.

"అది కదలకుండా దిగ్బంధనం చేస్తానని అంటిరిగా. భయం ఎందుకూ?" అన్నది శ్రీమతి శాస్త్రి.

"దిగ్బంధనమా నా బొందా? ఏవో నాలుగు రూకలు వస్తాయని అన్నాను గానీ.." తనలో తను గొణుక్కున్నాడు శాస్త్రిగారు. శ్రీమతి శాస్త్రిగారు ఆంజనేయ దండకం ఆపాటికే మొదలెట్టింది.

తటాల్న మెరుపులు.. ఆ మెరుపుల్తోపాటు ఉరుములు. ఊరు ఊరంతా దద్దరిల్లిపోయింది. ఆ మెరుపులు ఒకదాని తరువాత ఒకటిగా, మాలలో పూసల్లా ఊరిని ఆ అర్ధరాత్రిలో పట్టపగలా అన్నట్లు ఓ ఉజ్వలమైన కాంతితో నింపుతుంటే, ఉరుములు కూడా ఒకటి వెంట మరొకటి ఉరుముతూ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశాయి. కదలడానికి కూడా ఎవరికీ ధైర్యంలేదు.

ఉరుములు మెరుపులతో పిడుగులు పడటం ప్రారంభమయింది. ఆ తరవాత ప్రచండంగా గాలి. ప్రజలకి భయంతో గుండెలు అవిసిపోతున్నై. టపటపా వర్షం మొదలైంది. పెద్ద పెద్ద చినుకులతో బాటు వడగళ్ళు కూడా పడుతున్నాయేమో, గుడిసెలూ, పెంకుటిళ్ళూ వడగళ్ళ సవ్వడితో మారు మోగిపోతున్నై. కుంభవృష్టి అకాల వర్షం. నేలబారు ఇళ్ళల్లోకి వర్షపు నీరు రాసాగింది. ప్రకృతి ప్రళయనాదం జనాలకి ఓ అపశకున మంత్రంలా వినిపించసాగింది.

బయటకు రాలేక, లోపలికొస్తున్న నీటిలో ఏం చెయ్యాలో తెలీక ఒణుకుతున్నారు పేద ప్రజలు. అసలా ఊళ్ళో వాన కురవడమే అరుదు. ఒకసారి చెరువులు నిండితే మూడేళ్ళవరకూ భూగర్భజలాలు నిండుగా వుంటై. అందువల్ల ప్రజలకి కరువుతో మాడాల్సిన భయంలేదు. మూడు మంచి నీళ్ళ బావులు వున్నై. ఊరంతా తోటలతో పచ్చగా వుంటుంది. ఆ పచ్చదనం కూడా ఆ సర్పశిలాలయం, అంటే, తక్షేశ్వరాలయ మహిమే అనుకుంటారు ప్రజలు.

ముసల్ది వచ్చి అందర్నీ భయపెట్టాక మాత్రమే జనంలో భయం పట్టుకుంది. దానికితోడు ఎవరెవరో ఊరికి రావడం, ఆ ఆలయాన్ని గురించి ప్రశ్నలు గుప్పించడం జనాల్ని ఇంకా భయభ్రాంతుల్ని చేశాయి.

వర్షం కుండపోతగా కురుస్తూనే వున్నది. అంతకంతకీ వర్షపు సవ్వడి గాలి హోరుతో కలిసి ఇళ్ళని ఊపేస్తున్నది సుడిగాలిలా.

గుడిపూజారి మేలుకునే వున్నాడు. తక్షపురం కొండ దగ్గరున్న చిన్న ఆంజనేయస్వామి గుడిపూజారి అతను. జనాల్ని భయపెట్టి డబ్బు చేసుకోవాలన్న ఆలోచనకి పదును పెడుతున్నాడతను. అతనికి తెలుసు, శాస్త్రిగారు, ప్రవచనాచార్యుడు, ప్రెసిడెంటు సంపూర్ణంగా సహకరిస్తారని.

"ఏమిటీ ఆలోచన?" అడిగింది పూజారి భార్య కుముదిని. ఆమె పల్లెటూరిది కాదు. చదువుకున్నది కూడా. తన ఆలోచనలని ఆమెకి చెప్పే ధైర్యం లేదు పూజారికి. కుముదిని ఓ పద్ధతి ప్రకారం నడుచుకునే వ్యక్తి. సహాయం చెయ్యడంలో ముందు వరసలో ఉంటుంది. అన్యాయం చెయ్యడానికి ప్రయత్నిస్తే చీల్చి చెండాడుతుంది.

"ఏదీ లేదు.. ఈ ప్రళయంలా ముంచుకొచ్చిన వర్షం ఎందుకొచ్చిందో, ఎంతకాలముంటుందో తెలీడంలేదు. తక్షేశ్వరాలయపు గడబిడ వుండనే వుంది. ఈపాటికే చెరువులు నిండిపోయివుంటాయి. అవి గనక గట్లు తెంచుకుంటే ఊరు సగానికి మునుగుతుంది" నిట్టూర్చి అన్నాడు పూజారి.

"ఏమీకాదు. కంగారు పడకండి. అర్థరాత్రి వచ్చిన వర్షం ఉదయాన్ని చూడదని సామెత?" పక్కకి తిరిగి అన్నది కుముదిని.

"సామెతలు అన్నీ నూటికి నూరుపాళ్ళూ నిజం కావు. ప్రస్తుత పరిస్థితుల్లో బయటకు వెళ్ళడం అసాధ్యం. ఒకవేళ యీ వర్షం ఇలాగే కురుస్తూ పోతే రేపూ బయటికి వెళ్ళలేము.." మెల్లగా అన్నాడు పూజారి. ఈ పరిస్థితిని డబ్బు చేసుకోవాలంటే ఏదో ఒక కారణాన్ని సృష్టించాలి. శాస్త్రిగారు తెలివైన వాడే, కానీ అతన్ని నమ్మడానికి వీల్లేదు. తనలోతానే ఆలోచిస్తున్నాడు పూజారి.

"ఈ పరిస్థితిలో వున్నది మనం మాత్రమే కాదుగా" అందరికీ ఏం జరుగుతుందో మనకీ అదే జరుగుతుంది. నిశ్చింతగా అన్నది కుముదిని.

" నీ అంత నిశ్చింతగా నేను వుండలేను కుముదినీ. నేను ఊరు మంచి కోసం ఆలోచించాల్సిన వాడిని అది నా బాధ్యత" లోపల సంగతి ఏదైనా, బైటికి మాత్రం పరమ సిన్సియర్‌గా అన్నాడు పూజారి.

పకపకా నవ్వింది కుముదిని. ఆవిడ ఎందుకు నవ్విందో అడిగే ధైర్యం అతనికి లేదు. మొహం గంటు పెట్టుకుని కూర్చున్నాడు.

"ఆలోచనలు కట్టిపెట్టి భగవంతుడ్ని ప్రార్ధించండిచాలు... అన్నీ సర్దుకుంటాయి" దుప్పటి కప్పుకుని అటువైపు తిరిగింది కుముదిని.

"తక్షపురం వెళ్ళాల్సిన అవసరం వుందంటారా?" అడిగాడు శృంగి.

" వెళ్ళాలని ఎవరన్నారూ" అడిగారు పరమేశ్వర శాస్త్రిగారు. మట్టూ అన్నాడు.

"ఈ అనిశ్చిత స్థితిని కారణం అక్కడ దొరకవచ్చని!" అన్నాడు శృంగి.

" నీ ఉద్దేశ్యం ఏమిటి?" అడిగారు శాస్త్రిగారు శృంగిని.

"అయ్యా.. మొన్న మొన్నటివరకూ నేను బ్రాహ్మణుడుననే అహంకారం ఉండేది. మట్టూని గమనించాక ఆ అహంకారం కొంతలో కొంత అణిగింది. 'మట్టూ'ది భిల్లజాతి. వారు నిజమైన ప్రకృతి పుత్రులు. మన శాస్త్రాలు నేర్పేజ్ఞానన్నంతా వారికి ప్రకృతి నేర్పుతుంది. ఎప్పుడూ లేనిది నిన్న రాత్రి మట్టూ నన్ను నిద్రలేపి అన్నాడు" ఆగాడు శృంగి. మట్టు ఆ సమయంలో అక్కడలేదు.

"ఏమన్నాడు?" అడిగారు శాస్త్రిగారు.

"ఓ మహా సర్పం పడగ ఎత్తి బుసకొడుతోందన్నట్టు కలవచ్చిందన్నాడు. పడమటి మబ్బులు కమ్మి పాతాళాన్ని పెకలిస్తున్నాయన్నాడు. తక్షపురంలో పిడుగులు రాలుతుండగా పిశాచాలు తొడలు కొట్టినాయన్నాడు" చెప్పాడు శృంగి.

"నీకేమనిపించింది?" సూటిగా అడిగారు శాస్త్రిగారు.

"అదే మట్టూని అడిగాను. తక్షపురం వెళ్ళాలా అని" తలవొంచుకుని అన్నాడు శృంగి.

"భూమి నీటితో మెత్తబడ్డప్పుడే గునపం దింపాలి అన్నాడు."

"అంటే?"

"అది తెలియకే మిమ్మల్ని అడిగాను స్వామీ. మనం తక్షపురం వెళ్ళాల్సిన అవసరం వుందా అని" శాస్త్రిగారిని చూస్తూ అన్నాడు శృంగి.

"శృంగి ఎక్కడికెళ్ళాడు?"

"తెలీదండి. తెల్లారిన తరవాత నాకు కనపడలేదు" జవాబిచ్చాడు శృంగి.

"రామజోగి?" అడిగారు శాస్త్రిగారు.

"ధ్యానం చేసుకుంటున్నారు" జవాబిచ్చాడు శృంగి.

శాస్త్రిగారు మౌనంగా వున్నారు. శృంగి కాసేపు అక్కడ నిలబడి ఆ తరవాత సెలవు తీసుకుంటున్నట్టుగా తలపంకించి కదిలి వెళ్ళిపోయాడు.

శృంగి మనసులో ఓ చిన్న అసంతృప్తి. ఆయన, అంటే శాస్త్రిగారినించి ఏ సమాధానమూ రాకపోవడం శృంగిని అసంతృప్తికి గురిచేసింది

" మట్టూ ఎక్కడికి పోయాడో తెలీయదు." శృంగి నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

'మట్టూ'కి నిగ్రహం ఎక్కువ. ఒక్క పలుకు  కూడా ఎక్కువ తక్కువ మాట్లాడడు. ఒకవేళ ఎదురుగా వున్నా, మట్టూ మనసులో ఏముందో చెప్పడని శృంగికి అనుభవమే.

అతని మనసులో 'మధుర' మెదిలింది. ఎంత అద్భుతమైన స్త్రీ ఆమె. కన్నతల్లిలా వొండిపెడుతుంది. ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా సహించలేదు. ఒంటరిగా ఉంటుంది. రామజోగి వెళ్ళినప్పుడు మాత్రమే ఆమెకి వెలుగు.

శృంగి మనసులో రకరకాల ఆలోచనలు. మధురని వదిలి ఇన్నాళ్ళూ రామజోగి ఇక్కడ ఇలా వుండటం అతనికి నచ్చలేదు. కానీ గురువుని ప్రశ్నించే ధైర్యం లేదు. తిరిగి తిరిగి మళ్ళీ మధ్యాహ్నానికి గూటికొచ్చాడు శృంగి.

"ఏమయ్యా శృంగీ, నీళ్ళూ నిప్పులూ లేకుండా పొద్దుట్నించీ ఎక్కడికిపోయావు? కాళ్ళు కడుక్కునిరా భోజనం వడ్డిస్తా" అన్నది విమల సుందరి. ఆవిడ TVN భార్య.

"అందరూ భోంచేశారా అమ్మా?" సిగ్గుపడి అన్నాడు శృంగి. అతనికి తెలుసు. అతిధులు నిరాహారంగా వున్నప్పుడు గృహస్తు ఏదీ ముట్టరని.

"అందరూ నీకోసమే ఎదురు చూస్తున్నారు" సన్నగా అన్నది విమల సుందరి.

'మట్టూ ఎక్కడ' అని అడగాలని లోపలవున్నా, అడగటానికి మాటరాక బావివైపు నడిచాడు శృంగి. గబగబా నాలుగు చేదలు తోడి ఒంటిమీద పోసుకుని, దండెం మీద ఆరేసిన పొడి పంచకట్టుకున్నాడు శృంగి.

విమలసుందరి హాల్లో విస్తళ్ళు వెయ్యడం అతనికి కనపడింది.

"ఇది రెండవ స్వప్నం. రాబీ చూసిన స్వప్నంలో మాహాభారతకాలం నాటి ఆయుధాలు కనిపించాయి. మట్టూకన్న స్వప్నంలో ఓ మహాసర్పం పడగెత్తి బుసకొట్టడం, పిశాచాలు తొడగొట్టడం, తక్షపురంలో పిడుగులు పడటం, వర్షం ఊరిని ముంచెత్తడం వంటి భీభత్సాలు ఉన్నాయి. ఈ రెండింటికీ ఏమైనా సంబంధం వుందా?" అడిగారు శాస్త్రిగారు రామజోగిని.

"ఉందంటే వుంది. సర్పాలూ మహాసర్పాలూ మణిమాణిక్యాలకి కాపలా వుంటాయని చెబుతారు. అది నిజమా కాదా అనేది సందేహమైనా, పాములు పుట్టల్లో వుండటం నిజం. ఇనుము వున్న చోట, ముఖ్యంగా ఇనుప తుప్పు వుండే చోట ఖచ్చితంగా పాములు తిరుగాడుతాయనేది సత్యం, అదీ నిర్మానుష్యమైన ప్రదేశాల్లో ఎక్కువ సంఖ్యలో వుంటాయనే రుజువులు చాలా వున్నాయి. పాములు ఇనుప తుప్పుకోసమే రైల్వే ట్రాక్స్ వద్దకి పోతాయి. తుప్పుపట్టిన పాత ట్రంకుపెట్టెలన్నా, ఇనుప వసువులన్నా వాటికి చాలా ఇష్టమట. ఇది నేను కొందరు పరిశోధకులు చెప్పగా విన్నది" ఓ క్షణం ఆగాడు రామజోగి.

"అవును.. నేనూ చదివాను" ఉత్సాహంగా అన్నాడు శ్రీనివాస్.

శ్రీనివాస్, శరద్వతి ఆ పొద్దునే TVN గారింటికి వచ్చారు.

"గుడ్.. ఆ విషయం నేనూ విన్నా" అన్నారు. Dr. TVN.

"మహాభారత కాలపు 'మెటలర్జీ' (లోహశాస్త్రం) ఇప్పటి మెటలర్జీకంటే చాలా ఉన్నతమైనదని గుర్తుంచుకోవాలి. ఆ ఆయుధాలు అసలు తుప్పు పడతాయని నేను అనుకోను కానీ, కాలమహిమని ఏమని వర్ణించగలం? ఒకవేళ అవి ఏమాత్రం తుప్పుపట్టినా మహా సర్పాలు వాటి చుట్టుపక్కల నివసిస్తూ వుండొచ్చు. లేదా 'నిధు'లుగా భావించి వాటికి కాపలాగా వుండివుండొచ్చు. అలా చూస్తే ఆయుధాలకీ సర్పాలకీ ఓ చిన్న సంబంధం వుంది.. ఇంకా చెబితే.." ఆగాడు రామజోగి.

"ఊ" అన్నారు డాస్త్రిగారు.

"ఇంకా చెబితే, భీభత్సమైన వర్షాలు కురిసినప్పుడు పుట్టలు నీటితో నిండిపోతాయి. పాములు నీటిలో కొంతసేపు యీదగలవేగానీ, అవి ఉభయచరాలు కావు. చీమలు పెట్టిన పుట్టల్లోనే కాదు, భూమి లోపలి పొరల్లో జీవించే మహాసర్పాలు కూడా నీరు తగిలితే బయటికి రాకమానవు. అవి చల్లగా వుండే ప్రాంతాలలో నివసించడానికి ఇష్టపడతాయేగానీ, నీటిలో కాదు" మళ్ళీ ఆగాడు రామజోగి.

"అంటే?" అడిగాడు శృంగి.

“తక్షపురంలో వర్షం పడటం, పిడుగులు పడటం, పిశాచాలు తొడలు గొట్టడం వంటి స్వప్నం గనక నిజమైతే, మహా భీకరకాలం నాటి ఆయుధాల రహస్యం బయటపడే రోజు దగ్గరలోనే ఉందనిపిస్తోంది. స్వప్నం ఒక లక్షణం. అయితే, మట్టూ వచ్చేదాకా మనకి స్పష్టమయిన సమాచారం తెలీదు" అన్నాడు రామజోగి.

"మట్టూ తక్షపురం వెళ్ళాడా?" ఆశ్చర్యంగా అన్నాడు శృంగి.

"తెల్లకి తెల్లవారు ఝామునే బయలుదేరి వెళ్ళాడు" చిన్నగా అన్నాడు రామజోగి.

"ఓహ్..." అన్నారు శాస్త్రిగారు.

"అవును శాస్త్రిగారూ, తన స్వప్న వృత్తాంతం నాతో చెప్పాడు. ఆ స్వప్నం వచ్చిన ఘడియ చాలా ప్రత్యేకమైనది. అందుకే ఆ తక్షపురం వెళ్ళి సమగ్ర సమాచారం సేకరించి రమ్మని నేనే మట్టూని ఊరు పంపాను" అన్నాడు రామజోగి.

"చాలా మంచిపని చేశావు జోగీ. అతడు సరైనవాడు. చూసిందీ, విన్నదీ ఏదీ మరువడు. చాలా సూక్ష్మగ్రాహి" మట్టూని మెచ్చుకుంటూ అన్నారు శాస్త్రిగారు.

"గురూజీ, నేనూ వెళ్ళేవాడినిగా, మట్టూతో" శృంగి గొంతులో కాస్త నిష్టూరం, కాస్త బాధ.

"మట్టుకూడా అదేమాట అన్నాను. నేనేవద్దన్నాను. శృంగీ, మట్టూ తనని తాను మరుగుపరచుకోగలడు. భిల్లులకి అది వెన్నతో పెట్టిన విద్య. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగల శారీరిక, మానసిక ధైర్యాలు వాళ్ళ సొత్తు, వేటలో వున్నప్పుడు రోజుల తరబడి అభోజనంగా వుండటం వారికి అత్యంత సహజమైన అలవాటు. ఇక నిద్ర సంగతంటావా, చెట్టైనా, పరుపైనా, కటిక నేలమీదైనా వారు నిద్రించగలరు. ఆ నిద్ర మనలాంటివారికుండే నిద్రకాదు. ఒకపక్క మేలుకునే, మరోపక్క నిద్రించగలరు. ఎంత చిన్న సవ్వడి అయినా, వారి చెవులద్వారా మెదడుకి చేరి తీరవలసినదే! అందుకే అక్కడికి మట్టూని పంపాను. అటువంటి పరిస్థితుల్లో విషయసేకరణ చెయ్యగలవాడు నాకు తెలిసి మరొకడు లేడు" స్పష్టంగా అన్నాడు రామజోగి.

అప్పటికిగానీ 'మట్టూ'లో వున్న ప్రత్యేకత శృంగికి అర్థంకాలేదు. ఓ సుదీర్ఘ నిట్టూర్పు అతని నాశికనించి వెలువడింది.

"మరొక విషయం ఏమంటే, మన 'చూపు' వేరు. కంటికి కనబడనిదాన్ని చూడగలగడమే మనో నేత్రపు చూపు. మనం అడవికి వెడతాం. ఎలాగొలా గమ్యం చేరతాం. కానీ, దారిలో ఏవీ గుర్తించం, ప్రకృతి సౌందర్యం తప్ప. అదే ఓ బిల్లుడైతే దారిని గమనిస్తాడు. ఏ జంతువు నడిచిందో, నడిచి ఎంతసేపు అయివుంటుందో కూడా స్పష్టంగా చెప్పగలడు" ఆగాడు రామజోగి.

"కానీ, తక్షపురం అడవికాదుగా, గుళ్ళున్నాయి. బడులున్నాయి. వ్యాపారాలున్నాయి. వ్యవహారాలున్నాయి, జనాలున్నారు. బస్సులూ, రిక్షాలు కూడా ఉంటాయి. ఏ విషయాన్నీ ఆ 'గుప్పెడు' ఊరు దాచలేదుగా!" అన్నాడు శ్రీనివాస్.

"మంచిమాట అన్నావు. అది అరణ్యం కాని సంగతి నిజమే. కానీ, జంతువుల కంటే క్రూరమైన మనుషులుండే జనారణ్యం. జంతువులుకంటే క్రూరమైన మనుషులుండే జనారణ్యం. జంతువులు ఆకలికోసం చంపుతాయి. మనిషి తనకోసమే కాదు, వందతరాలకి చాలినంత ఆస్తివున్నా, ఇతర్లని మోసగించి సంపాయిస్తూనే వుంటాడు. లోకాన్ని మోసగించి దాస్తూనే వుంటాడు. క్రూరజంతువులు చేసే హింస కళ్ళకి కనపడుతుంది. క్రూర మానవులు చేసే పనులు కళ్ళకి కనపడవు. వాటిని పసిగట్టటం మట్టూలాంటి వారికి మాత్రమే సాధ్యం" నిర్లిప్తంగా అన్నాడు రామజోగి.

"ఎక్కడేసిన దుప్పటి అక్కడే వుండకుండా ఇవ్వాళ మట్టూ స్వప్న వృత్తాంతంతో ముందుకి కదిలింది" చిన్నగా నవ్వి అన్నారు Dr.TVN.

శరద్వతి అంతా వింటూనే వున్నది. భాష తెలియకపోయినా భావాలు ఆమెకి అర్థమవుతూనే వున్నాయి.

"ఒకవేళ ఆయుధాల ఆచూకీ దొరికితే" ఆగింది శరద్వతి.

"ఊ...దొరికితే? చెప్పమ్మా..." అన్నారు శాస్త్రిగారు.

"పాంచజన్యం నాకు ఇస్తారా. ఒకసారి చూసి ఇచ్చేస్తా" చిన్న పిల్లలా అడిగింది శరద్వతి.

పకపకా నవ్వారు శాస్త్రిగారు.

"తల్లీ.. నీ నోటిచలువ వల్ల అవి దొరకాలేగానీ, అది నీ బిడ్డకు కానుకగా ఇవ్వమూ" అంటూ లేచి శరద్వతి తలనిమిరి అన్నారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments